ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 12 జులై 2024 | 5

బండారం బద్దలు!





కాకినాడలో గోదాములు తనిఖీ చేస్తున్న మంత్రి నాదెండ్ల

- కాకినాడ పోర్టు పరిసరాల్లో సీజ్ చేసిన బియ్యం రేషన్ నుంచి దారి మళ్లినవే
- గోదాముల నిండా రేషన్ ద్వారా సరఫరా చేసిన ఫోర్ట్ ఫైడ్ బియ్యమే
- సీజ్ చేసిన శాంపిళ్లన్నీ ల్యాబ్ టెస్ట్‌లో ఫోర్ట్‌ఫైడ్ కెర్నెల్ బియ్యంగా నిర్ధారణ
- సీజ్ చేసిన 39,870 టన్నుల్లో12,184 టన్నుల్లో రేషన్ ఆనవాళ్లు గుర్తింపు
- ఎట్టకేలకు రేషన్ ఎగుమతి దందా బండారం బద్దలుకొట్టిన కూటమి సర్కారు
- గత అయిదేళ్లుగా బియ్యం ఎగుమతితో అక్రమార్కులు కోట్లలో ఆర్జన
- ల్యాబ్‌లో నిజాలు నిగ్గుతేలడంతో ఏడు గొడౌన్‌లకు నోటీసులు జారీ
- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల ఇటీవల తనిఖీల్లో భారీగా బియ్యం సీజ్
- వీటిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని అప్పట్లో ఆదేశించిన నాదెండ్ల
- తాజా ల్యాబ్ రిపోర్టు నేపథ్యంలో చర్యలకు ఉపక్రమిస్తున్న అధికారులు

బియ్యం అక్రమార్కుల గుట్టు వీడింది...అడ్డగోలు రేషన్ దందా బయటపడింది..ఇన్నాళ్లు గుట్టుగా విదేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లకుకోట్లు సంపాదిస్తున్న దొంగల బండారం బట్టబయలైంది. గత ప్రభుత్వ పెద్దల దన్నుతో రేషన్ దందాను యథేచ్ఛగా కొనసాగిస్తోన్న భోక్తల పాపం బద్దలైంది..గోదాముల్లో గుట్టుగా ఎగు మతి కోసం ఉంచిన బియ్యంలో పేదల కోసం పంచిన రేషన్ బియ్యం ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. సీజ్ చేసిన గోదాముల బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థ ల్యాబ్ పసిగట్టేసింది. బియ్యంలో పేదల కోసం సరఫరా చేస్తోన్న ఫోర్టిఫైడ్ కెర్నెల్ ఆధారాలు బయటపడిపోయాయి. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల స్వయంగా ఆకస్మిక తనిఖీలతో పట్టుకున్న బియ్యంలో రేషన్‌మాఫియా ఉన్నట్లు నిజం నిగ్గుతేలింది. ఈనేపథ్యంలో కాకినాడపోర్టు పరిసరాల్లో ఉన్న ఏడు బియ్యం గోదాములకు అధికారులు నోటీసులు జారీచేశారు. కాగా రేషన్‌బియ్యం నౌకల ద్వారా గతచిన కొన్నేళ్లుగా విదేశాలకు భారీగా ఎగుమతవుతున్నాయన్న అందరి అనుమానాలు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం రాకతో ఆధారాలతో వెలుగులోకి వచ్చినట్లయింది.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యం విదేశాలకు లక్షల టన్నుల్లో అక్రమంగా ఎగుమతవుతోంది. ప్రధానంగా వైసీపీ అధికారంలో ఉన్న అయిదేళ్లలో రేషన్ దందా భారీగా పెరిగిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కిలో రూపాయి బియ్యాన్ని వైసీపీ అండ దండలున్న పలువురు వ్యాపారులు రూ.6కి కొనుగోలు చేసి కాకినాడకు లక్షల టన్నుల్లో గడచిన అయిదేళ్లలో తరలించారు. వీటిని కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం, ఆయన మనుషులు కొనుగోలు చేసి మిల్లులకు తరలించి అక్కడ పాలిష్‌చేసి కిలో రూ.56 చొప్పున విదేశాలకు కాకినాడ యాంకరేజ్ పోర్టు నుంచి ఎగుమతి చేసి కోట్లకు కోట్లు సంపాదించారు. ప్రధానంగా ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచి నిత్యం లారీల్లో లక్షల టన్నుల రేషన్ బియ్యం కాకినాడ, చుట్టుపక్కల అనేక మిల్లులకు చేరేది. ఈ క్రమంలో పలుసార్లు రేషన్ బియ్యం పట్టుబడేవి. ఎక్కడ పట్టుబడినా వాటి చిరునామా ద్వారంపూడి, ఆయన అనుచరుల గోదాములు, మిల్లుల వద్దే తేలేవి. ఇలా కొన్నేళ్లుగా యథేచ్ఛగా ద్వారంపూడి, ఆయన అనుచరులు, బంధువుల మిల్లులు, గోదాములకు వందలకోట్ల విలువైన రేషన్ బియ్యం చేరేవి. వీటిని గుట్టుగా మిల్లుల్లో పాలిష్‌చేసి నౌకల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఇది చాలవన్నట్టు ఒడిషా, కోల్‌కతా, తెలంగాణ నుంచి కూడా రేషన్, ఇతర బియ్యాన్ని కారుచౌకగా కొని ఇక్కడ గోదాముల్లో నిల్వచేసి పాలిష్ చేసి ప్యాకింగ్ మార్చేసి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తూ కోట్లలో సంపాదించేశారు. కానీ ఏ రోజు అధికారులు ఈ మిల్లులు, గోదాములపై దాడులు చేయడానికి సాహసించలేదు. ఫలితంగా కాకినాడ పోర్టు నుంచి యథేచ్ఛగా బియ్యం ఎగుమతులు ఆఫ్రికా దేశాలకు తరలిపోయేవి. అలాగే రేషన్ బియ్యంతోపాటు అనేక జిల్లాల్లో పేదలకు రాష్ట్రప్రభుత్వం పౌష్టికాహారం కింద పంపిణీ చేసిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని కూడా కొనుగోలుచేసి పాలిష్ చేసి విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఇన్ని అక్రమాలు ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ బియ్యం మాఫియాపై దృష్టిసారించింది. ఈ క్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల కాకినాడ కేంద్రంగా ఎగుమతి అవుతున్న రేషన్‌బియ్యం అక్రమాల నిగ్గు తేల్చేందుకు స్వయంగా రంగంలోకి దిగారు. గత నెలాఖరున కాకినాడ పర్యటనకు వచ్చిన ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అధికారులకు సైతం తెలియకుండా నేరుగా కాకినాడ యాంకరేజ్ పోర్టుకు వెళ్లారు. విదేశాలకు ఎగుమతి అవడానికి సిద్ధంగా బార్జిల్లో ఉన్న బియ్యాన్ని పరిశీలించారు. ఆ తర్వాత పోర్టు సమీపంలోను, కాకినాడ రూరల్ పరిధిలోని ఎనిమిది గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఒక్కో గోదాముల్లో వేల టన్నుల బియ్యం ఎగుమతి సిద్ధంగా ఉండడంతో అనుమానం వచ్చిన కొన్ని బస్తాలను స్వయంగా తనిఖీ చేశారు. వీటిలో చాలావరకు రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించి కొన్ని బస్తాల్లోంచి 12 శాంపిళ్ల వరకు బియ్యం తీసుకున్నారు. పాలిష్ చేసిన ఈ బియ్యం రేషన్ దుకాణాల నుంచి వచ్చినవా?కావా? అనేది నిర్ధారించడానికి ల్యాబ్‌కు తరలించారు. రికార్డులు సక్రమంగా లేని, అనుమానం ఉన్న బియ్యానికి సంబంధించి ఎనిమిది గోదాముల్లో 39,870 టన్నుల బియ్యం సీజ్‌చేశారు. ఇందులో అశోకా, హెచ్1 గోదాముల్లోనే 5,300 టన్నులు సీజ్‌చేశారు. మంత్రి నాదెండ్ల ఆకస్మిక తనిఖీ చేయడంతోపాటు ఒకేసారి ఇంత పెద్ద మొత్తంలో బియ్యాన్ని సీజ్ చేయడం సంచలనం కలిగించింది.

నిజం నిగ్గు తేలింది..

సీజ్ చేసి శాంపిళ్లు తీసుకున్న బియ్యాన్ని కాకినాడ జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు ల్యాబ్‌కు తరలించారు. కొన్ని రోజులపాటు ఈ బియ్యాన్ని ల్యాబ్‌లో పరీక్షించారు. అందులో భాగంగా ఏదైతే రేషన్ బియ్యం ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయోనని అనుమానించారో అదే నిజమైంది. పరిశీలించిన బియ్యంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు పంచిన ఫోర్టిఫైడ్ కెర్నెల్ రైస్ ఉన్నట్టు పరిశీలనలో ల్యాబ్ నిర్ధారించింది. మొత్తం 12 శాంపిళ్లలో 11 శాంపిళ్ల బియ్యంలో రేషన్ బియ్యం ఆనవాళ్లు గుర్తించారు. తద్వారా సీజ్‌చేసిన మొత్తం 39,870 టన్నుల బియ్యంలో 12,184 టన్నుల్లో రేషన్ బియ్యం కింద సరఫరా చేసిన ఫోర్టిఫైడ్ బియ్యం ఆనవాళ్లు నిర్ధారించారు. ఇంకా ఒక శాంపిల్‌కు సంబంధించి ఫలితం రాలేదు. ఈ నేపథ్యంలో తాజాగా ఏడు గోదాముల యాజమాన్యాలకు జిల్లా పౌర సరఫరాలశాఖ నోటీసులు పంపించింది. ల్యాబ్‌లో తేలిన ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యం ఎలా వచ్చాయి? ఎక్కడి నుంచి తెచ్చారు? ఏ జిల్లా నుంచి వీటిని కొనుగోలు చేశారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు, ఆధారాలు చూపాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. దీంతో ఇప్పుడు తమ బండారం బట్టబయలవడంతో ఆయా గోదాముల నిర్వాహకులు అడ్డంగా దొరికిపోయినట్టయింది. మరోపక్క రేషన్ బియ్యం మాఫియా కాకినాడ కేంద్రంగా జరుగుతోందని, ద్వారంపూడి కుటుంబం బియ్యం అక్రమాలు భారీగా ఉన్నాయని మంత్రి నాదెండ్ల అధికారికంగా ప్రకటించిన కొన్ని రోజుల వ్యవధిలోనే అసలు గుట్టు బయటపడడం విశేషం. కాగా ఈ కేసును త్వరలో సీఐడీకి కూడా అప్పగించనున్నట్టు ఇప్పటికే మంత్రి ప్రకటించారు. దీంతో ఇప్పుడు అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

ఉపాధి హామీ నిధులతో నిర్మాణాలు వేగవంతం చేయాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై11: జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన వివిధ నిర్మాణాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పనులు పురోగతిపై జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లాలో చేపట్టిన పనులు ప్రస్తుతం ఏయే దశలలో ఉన్నాయో వివరాలు సేకరించి నివేదిక సిద్ధం చేయాలన్నారు. అలాగే పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించి వివిధ దశల్లో ఉన్న 11 డ్రైన్స్, 19 సీసీ రోడ్లు, 230 ప్రభుత్వ భవనాల పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కొత్త పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గతంలో చేపట్టిన ఆర్బీకే, సచివాలయాలు, హెల్త్ క్లినిక్, డిజిటల్ లైబ్రరీ నిర్మాణాల పురోగతి, సీసీ డ్రైన్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీంద్ర, జిల్లా ఉపాధి శిక్షణా అధికారి శ్రీనివాసరావు, పెద్దాపురం డీఎల్‌డీవో ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం అధ్వాన్నం

- నవర జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఏడీ తనిఖీల్లో వెల్లడి..
- చర్యలకు సిఫార్సులు



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి పరిశీలిస్తున్న ఏడీ నాగేశ్వరరావు

సామర్లకోట, జూలై 11: సామర్లకోట మండలం నవర జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అమలుచేస్తున్న పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకం అధ్వానంగా ఉందని, గుడ్లు ఉడకలేదని, సాంబారు రుచి లేదని.. పొగవాసన వస్తోందని విద్యాశాఖ సహాయ సంచాలకులు పి.నాగేశ్వరరావు అన్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరుపైనా, పాఠశాల ఉపాధ్యాయుల ప్రవర్తనా శైలిపైనా గ్రామస్తుల నుంచి పలు ఫిర్యాదులు రావడంతో జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఏడీ నాగేశ్వరరావు గురువారం పాఠశాలకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. అలాగే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని నాగేశ్వరరావు తిని అధ్వానంగా ఉన్నట్టు నిర్ధారించారు. రాగిజావను మధ్యాహ్న భోజనాలతో తీసుకొస్తున్నందున ఆ సమయంలో రాగి జావను తాగలేకపోతున్నామని విద్యార్థులు ఏడీకి వివరించారు. ఈ మధ్యాహ్న భోజనాన్ని అల్లూరి సీతారామరాజు ఎడ్యుకేషనల్ సొసైటీ (ఎన్‌జీవో) సరఫరా చేస్తోందని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రతీ తరగతికి వెళ్లి విద్యార్థుల నుంచి మధ్యాహ్న భోజనం పరిస్థితిని ఏడీ అడిగితెలుసుకున్నారు. అధికశాతం మంది భోజనం రుచి, శుచి, నాణ్యతా ప్రమాణాలు లేకుండా పెడుతున్నారని, అందుకే తాము తినలేకపోతున్నామని వివరించారు. అలాగే పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, తాగు నీటి ఆర్వో ప్లాంట్ నిర్వహణాలేమి తదితర అంశాలపై ఏడీ పరిశీలించి తప్పుబట్టారు. ఈ మేరకు ఒక నివేదికను తదుపరి చర్యల నిమిత్తం జిల్లా విద్యాశాఖాధికారికి సమర్పించనున్నట్టు ఏడీ నాగేశ్వరరావు తెలిపారు.

ఉచిత ఇసుక విధానం రాష్ట్ర అభివృద్ధికి తొలి మెట్టు : సిటీ ఎమ్మెల్యే కొండబాబు

సీఎం చంద్రబాబు చిత్రపటానికి భవన నిర్మాణ కార్మికుల పాలభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కాకినాడ సిటీ, జూలై 11: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ఉచిత ఇసుక విధానం రాష్ట్ర అభివృద్ధికి తొలి మెట్టు అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. ఉచిత ఇసుక విధానంపై గురువారం స్థానిక మెయిన్‌రోడ్ గ్లాస్ హౌస్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హయాంలో జగన్ స్వలాభంకోసం సిమెంట్, ఇసుక ధరలు విపరీతంగా పెంచి భవన నిర్మాణ, సంబంధిత రంగాలను కుదేలు చేశాడన్నారు. నేడు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఉచిత ఇసుక విధానాన్ని అమలుచేసిందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కల నెరవేర్చాలనే ఆశయంతో ఉచితంగా ఇసుకు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు గదుల సాయిబాబు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు గ్రంధి బాబ్జి, బచ్చు శేఖర్, చింతలపూడి రవి, అమలకంటి బలరామ్, మల్లాడి గంగాధరం, రెడ్నం సత్తిబా బు, దంగేటి సతీష్, నెల్లి రమణ, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

కందిపప్పు వివరాలన్నీ ప్రభుత్వ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేయాలి : జేసీ

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 11: జిల్లాలోని ఉన్న హోల్‌సేల్ వ్యాపారులు, రిటైలర్లు, చిలర్ల వర్తకులు అందరూ కందిపప్పు, శెనగలు, కాబులి శెనగలు వారి వద్ద నిల్వ ఉన్న స్టాక్ వివరాలను భారత ప్రభుత్వ వెబ్‌పోర్టల్‌లో శుక్రవారం నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి ఆదేశించారు. అలాగే సెప్టెంబర్ 30వ తేదీ వరకు హోల్‌సేల్ వ్యాపారులు 200 మెట్రిక్ టన్నుల వరకు ఉంచుకోవాలన్నారు. అలాగే రిటైలర్లు 5 మెట్రిక్ టన్నులు వరకు నిల్వ ఉంచుకోవాలన్నారు. మిల్లర్లు గత మూడు నెలల ఉత్పత్తిగాని, 25 శాతం వార్షిక సామర్థ్యం నిల్వగాని ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం నిల్వలను అప్‌డేట్ చేయాలని, ఈ ఆదేశాలను ఉల్లంఘించి నిల్వలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి రంగరాయలో 'ఎర్నివా 3.0'

జీజీహెచ్ (కాకినాడ), జూలై 11: కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల తృతీయ ఏన్యువల్ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కాన్ఫరెన్స్ ఎర్నివా 3.0 కార్యక్రమం శుక్రవారం ప్రారంభిస్తున్నట్టు ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి తెలిపారు. ఆర్ఎంసీ కళాశాల్లో గత మూడేళ్లుగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని, ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఏపీ, తెలంగాణలో వైద్య కళాశాలల నుంచి సుమారు 430 మంది ఎంబీబీఎస్ వైద్య విద్యార్థులు హాజరుకావడం జరుగుతుందన్నారు. డిబేట్లు, బాడీఆర్ట్, స్పెల్‌బీ, పోస్టర్ ప్రజెంటేషన్లు తదితర కొంగొత్త ఆవిష్కరణలు 23 వర్క్‌షాపుల్లో ఈ కాన్ఫరెన్స్‌లు వైద్య విద్యార్థులు ప్రజెంట్ చేయడం జరుగుతుందన్నారు. ఫస్ట్ ఎయిడ్, బేసిక్ లైఫ్ సపోర్టు, సర్జికల్ స్కిల్స్, కంటి, చెవి, రేడియేషన్, అంకాలజీ, గైనికాలజీ, మెడికల్, ఫేటల్ ఫోరెన్సిక్ వంటి వాటిపై విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు దోహదపడుతుందన్నారు.



బెండపూడి విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

బెండపూడి హెల్త్ క్లినిక్‌కు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికెట్

తొండంగి, జూలై11: బెండపూడి1 విలేజి హెల్త్ క్లినిక్‌కు నేషనల్ క్వాలిటీ ఎస్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికెట్ లభించింది. ఈ మేరకు రావికంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమాచారం అందింది. రావికంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న బెండపూడి విలేజ్ హెల్త్ క్లినిక్‌ను గత నెల 20న కేంద్ర బృందం సందర్శించింది. క్లినిక్‌లో ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, వైద్యఆరోగ్య శాఖ ప్రకటించిన పథకాల అమలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని హెల్త్ క్లినిక్‌లకు సర్టిఫికెటేషన్ ఇవ్వనున్నారు. ఈ కేంద్ర బృందం తమ పరిశీలనలో తృప్తి చెంది 92.48 శాతంతో గ్రేడింగ్ ఇవ్వడంతో జిల్లాలో బెండపూడి హెల్త్ క్లినిక్ మొదటి స్థానం సాధించి సర్టిఫికెట్‌కు అర్హత సాధించింది. సర్టిఫికెట్ పొందిన క్లినిక్‌ల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేయనుంది. రావికంపాడు వైద్యులు డాక్టర్ అర్చన, డాక్టర్ లలిత కుమారిని వైద్య సిబ్బందిని జిల్లావైద్యాధికారి డాక్టర్ నర్సింహనాయక్, డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సరిత తదితరులు అభినందించారు.





గొల్లప్రోలులో తాగునీటి సరఫరా వ్యవస్థను పరిశీలిస్తున్న మునిసిపల్ ఆర్డీ, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ.. వీరిని నిలదీస్తున్న గొల్లప్రోలు ఈబీసీ కాలనీ వాసులు

తాగునీటి సమస్య పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

- మునిసిపల్ ఆర్డీ, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ ఆగ్రహం
- ఎమినిటిస్ సెక్రటరీ సస్పెన్షన్
- ఏఈపై క్రమశిక్షణా చర్యలు
- సెలవు పెట్టిన కమిషనరుపై చర్యలకు సిఫారసు

గొల్లప్రోలు, జూలై 11: గొల్లప్రోలు పట్టణ పరిధిలో తాగునీటి సరఫరా, సమస్య పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పురపాలకశాఖ ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్ (ఎఫ్ఏసీ) నాగనరసింహరావు, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈ సుధాకర్‌లు ఆగ్రహం వ్యక్తంచేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి ఎమినిటీస్ సెక్రటరీని సస్పెండ్ చేయగా, ఏఈపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. అనుమతులు తీసుకోకుండా సెలవు పెట్టిన నగర పంచాయతీ కమిషనరుపై చర్యలకు సిఫారసు చేస్తున్నట్టు తెలిపారు. గొల్లప్రోలు పట్టణంలో కొంతకాలంగా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారడంతో పాటు కుళాయిలు ద్వారా కలుషిత జలాలు సరఫరా కావడం, డయేరియా జాడలు కనిపిస్తుండడంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతోపాటు నగర పంచాయతీ రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన మోటార్లు కాలిపోయినా అధికారులు మరమ్మతులు నిర్వహించకుండా నిర్లక్ష్యం వ్యవహరించడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులుపడుతున్న విషయాలను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీడీఎంఏకు తెలియజేయడంతోపాటు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని సూచించారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు, ఆర్డీ, ఎస్ఈలు గొల్లప్రోలు పట్టణంలో పర్యటించారు. పట్టణంలో పది రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు రావడం లేదని, మోటార్లు రిపేర్లకు గురైనా అధికారులు పట్టించుకోవడం లేదని, కుళాయిల నుంచి కలుషిత జలాలు వస్తున్నాయని జనసేన నాయకులు ఆర్డీ, ఎస్ఈలకు తెలియజేశారు. తాగునీటి సరఫరాతోపాటు వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని వారు ఫిర్యాదు చేశారు.

నిలదీసిన ఈబీసీ కాలనీ ప్రజలు

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మునిసిపల్ ఆర్డీ, పబ్లిక్‌హెల్త్ ఎస్ఈలు రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న ఫిల్టర్‌బెడ్లు, పైపులైన్లు పరిశీలించి పథకం పనితీరుపై ఆరా తీశారు. అనంతరం ఈబీసీ కాలనీలో పదేళ్లుగా నిరుపయోగంగా ఓవర్‌హెడ్ రిజర్వాయర్‌ను పరిశీలించి విస్మయానికి లోనయ్యారు. ట్యాంకు చుట్టూ తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి పరిసరాలు మురికికూపంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తాగునీరందక తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని వారు ఆర్డీ, ఎస్ఈలను నిలదీశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఎమినిటీస్ సెక్రటరీ సౌజన్యను సస్పెండ్ చేస్తున్నామని, నగర పంచాయతీ ఏఈ ప్రభాకర్‌పై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ ప్రకటించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మూడు మోటార్లు కాలిపోయాయని, తాత్కాలికంగా రెండు మోటార్లు బిగించి తాగునీటిని సరఫరా చేస్తున్నామని అధికారులు తెలిపారు. పర్యటనలో పబ్లిక్‌హెల్త్ డీఈ హుస్సేన్, నగరపంచాయతీ మేనేజరు రాంప్రసాద్, జనసేన నాయకులు కడారి తమ్మయ్యనాయుడు, బస్వా చిట్టిబాబు, బలిరెడ్డి గంగబాబు, పర్ల రాజా, మామిడాల సూరిబాబు, వినుకొండ అమ్మాజీ, పిల్లా రమ్యజ్యోతి, స్వచ్ఛ గొల్లప్రోలు కన్వీనర్ కొశిరెడ్డి రాజా తదితరులు ఉన్నారు. కాగా అధికారుల అనుమతి లేకుండా సెలవు పెట్టిన గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనరు రవికుమార్‌పై చర్యలు తీసుకోవాలని సీడీఎంఏకు సిఫారసు చేస్తున్నట్టు ఆర్డీ నాగనరసింహరావు చెప్పారు.

కార్పొరేషన్ సిబ్బందికి రూ.3.20 కోట్లకు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు

కార్పొరేషన్(కాకినాడ), జూలై11: కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ ఉద్యోగులకు రూ.3.20కోట్లకు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు జారీచేసింది. ఆధార్, పాన్ అనుసంధానం చేసుకోవాలని ఏడాదికాలంగా కేంద్రం గడువు పెంచుకుంటూ అవకాశం ఇస్తున్నప్పటికీ ఉద్యోగులు అనుసంధానం చేసుకోకపోవడంతో ఇన్‌కంట్యాక్స్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని హెల్త్ సెక్షన్‌లో 150 మందికి, ఇతర సెక్షన్లలో 60 మందికి నాల్గో తరగతి ఉద్యోగి నుంచి ఉన్నతాధికారులకు వరకు నోటీసులు జారీచేసింది. ప్రతీ నెలా వారి వారి జీతాలనుబట్టి వాయిదాల రూపంలో జీతాల నుంచి ఇన్‌కంట్యాక్స్ కట్ చేసి, ఇంకా చెల్లించాల్సిన బకాయిలను ఫిబ్రవరిలో ఏకమొత్తంలో రికవరీ చేసి ఆదాయపన్నుశాఖకు జమచేస్తామని ఆ నోటీసులో పేర్కొంది. ఇటీవలే పాన్, ఆధార్ లింక్ చేయని వారికి వార్షికాదాయం మొత్తం మీద 20 శాతం అపరాధ రుసుంను ఏక మొత్తంలో చెల్లించాలని నగరపాలక సంస్థకు నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులనుసరించి అకౌంట్స్ విభాగం నుంచి అన్ని శాఖాధిపతులకు సర్క్యులర్ జారీచేశారు. ఉదాహరణకు మున్సిపల్ పారిశుధ్య కార్మికుడికి ఒక్కొక్కరికి ఆధార్ పాన్ లింక్ చేసుకోని వారికి రూ.1.80 లక్షలు ఇన్‌కంట్యాక్స్ చెల్లించాలని నోటీసుల్లో సూచించారు. కేంద్రం మరోసారి ఆధార్, పాన్ అనుసంధానికి సమయమిస్తే ఉద్యోగులు ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ వేసుకోవడం వల్ల తిరిగి అమౌంట్ వచ్చే అవకాశముందని అధికారులు తెలిపారు.

19న అరుణాచలం యాత్ర స్పెషల్ బస్సు సర్వీస్

కార్పొరేషన్(కాకినాడ), జూలై11: కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి ఈనెల 19న అరుణాచలం క్షేత్రానికి స్పెషల్ బస్సు వేసినట్టు డిపో మేనేజర్ మనోహర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు కాకినాడలో 19వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు బయలుదేరి కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అరుణాచలం వెళ్లి అక్కడ గిరిప్రదక్షిణ పూర్తి చేసుకుని పెద్దకంచి తీసుకుని వెళ్లి ఆ తర్వాత కాళహస్తి చేరుతుంది. అక్కడి నుంచి 22న రాత్రి 10 గంటలకు కాకినాడ చేరుకుంటుందన్నారు. టిక్కెట్టు ధర రూ.3100 నిర్ణయించామని చెప్పారు. అరుణాచలం స్పెషల్ సర్వీసు అడ్వాన్స్ బుకింగ్ ఉందని, బుకింగ్ కోసం 7382910869, 7382910778 నెంబర్లను సంప్రదించాలన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. నలుగురికి గాయాలు
- గండేపల్లి మండలం కె.సూరంపాలెం వద్ద ఘటన



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

గండేపల్లి, జూలై 11: అతివేగంగా కారు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై గండేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండేపల్లి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన కడియాల మణికంఠ(22), ఇజ్జాపురెడ్డి సత్యనారాయణ, కందుల ఠాగూర్, అరవపల్లి శ్రీనివాస్, దొడ్డిపట్ల శ్రీను కలిసి బుధవారం రాత్రి పెద్దాపురం పనిమీద వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నారు. రాత్రి 12.30గంటల సమయంలో కె.సూరంపాలెం గ్రామ శివారు చెరువు వద్దకు వచ్చేసరికి కారును నడుపుతున్న దొడ్డిపట్ల శ్రీను అతివేగంగా నడుపుతూ డివైడర్ ఢీకొని పక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో కారులో ఉన్న కడియాల మణికంఠకు బలమైన గాయాలు కావడంతో పెద్దాపురం ఆసుపత్రికి తరలించే లోపు మార్గమధ్యలో మృతిచెందాడు. మిగిలిన నలుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. మృతుడి సోదరుడు కడియాల కిషోర్ ఇచ్చిన ఫిర్యాదుపై గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేశారు.



సీఎస్ఈ క్రేజ్



ఐటీ..మేటీ

దేశ వ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఐటీ సెక్టార్ సంక్షోభంలో ఉంది. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఐటీ సెక్టార్ ఏర్పాటు చేయకపోవడంతో మూడేళ్లుగా కంప్యూటర్ సైన్స్‌తో పాటు అనుబంధ విభాగాల్లో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. అక్కడి నుంచే ఉద్యోగ ప్రయత్నాలు చేసుకోవాల్సిన పరిస్థితిని గత జగన్ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో సైతం ఇంజనీరింగ్ చదవాలనుకునేవారి సంఖ్య అంతకంతకూ పెరగడం ఒకెత్తు కాగా సంక్షోభంలో ఉన్న ఐటీ సెక్టార్‌లోనే చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు. కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిందా సరే లేదంటే లక్షలు వెచ్చించి అయినా మంచి కళాశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులు తహతహలాడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పేరొందిన కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్‌కు ఎంత డిమాండు ఉందో వాటి అనుబంధ విభాగాల ఇంజనీరింగ్ విద్యకూ అదే డిమాండు కొనసాగుతోంది. పేరొందిన కళాశాలల్లో కంప్యూటర్ సైన్స్ సీటు మేనేజ్‌మెంట్ కోటాలో పొందాలంటే రూ.5లక్షల నుంచి రూ.6లక్షల వరకు పలుకుతోంది. పక్క జిల్లాలోని భీమవరంలోని ఓ కళాశాలలో అయితే అదే సీటు రూ.14లక్షలు పైబడే వుంది.

ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నా..
కంప్యూటర్ సైన్స్‌పైనే మక్కువ
మేనేజ్‌మెంట్ కోటా సీటుకైనా సిద్ధం
రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఫీజు
ఉమ్మడి జిల్లాలో కంప్యూటర్ సైన్స్
అనుబంధ విభాగాల్లో 9,985 సీట్లు



అమలాపురం రూరల్, జూలై 11:

సీట్లు..కళాశాలలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 23 ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో మొత్తం సీట్లు 14,520. ప్రభుత్వ పరిధిలోని కాకినాడ జేఎన్టీయూతో పాటు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మొత్తం 780 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ప్రధాన విభాగాలకు సంబంధించి 50 నుంచి 60 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఇక మిగిలిన 20 ప్రైవేటు కళాశాలల్లో 13,740 సీట్లు ఉన్నాయి. ఈ ఏడాది ఇంజనీరింగ్ కళాశాలల్లో ఐటీ విభాగానికి సంబంధించి అదనంగా 60 సీట్లకు ఏఐసీటీఈ అనుమతి ఇచ్చింది. కంప్యూటర్ సైన్స్‌పై విద్యార్థులు విపరీతంగా క్రేజ్ పెంచుకున్నారు. అందుకు అనుగుణంగానే పలు కళాశాలల్లో సీఎస్ఈ, అనుబంధ ఇంజనీరింగ్ కోర్సులను మాత్రమే కలిగి ఉండడం విశేషం. కోరంగిలో మూడు ఇంజనీరింగ్ కళాశాలల పేరిట కంప్యూటర్ సైన్స్ కోర్సులను మాత్రమే అనుమతి పొందారు. మిగిలిన ఇతర ఇంజనీరింగ్ కోర్సులేవీ అక్కడ లేవు. సీఎస్ఈ, ఏఐడీఎస్, మెషీన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి ఇంజనీరింగ్ కోర్సులకు మాత్రమే అనుమతి పొందారు. ఒక్కో కళాశాలలోను 540 నుంచి 780 సీట్లు ఉన్నప్పటికీ అవన్నీ కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాలకు చెందినవే. సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి మొత్తం 2,160 సీట్లు ఉండగా కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న కోర్సుల్లో 1,560 సీట్లు కేటాయించడం విశేషం. ఉమ్మడి జిల్లాలో 14,520 ఇంజనీరింగ్ సీట్లు ఉంటే కంప్యూటర్ సైన్స్ అనుబంధ విభాగాలకు 9,985 సీట్లు ఉన్నాయి. ఇక మిగిలిన 4,535 సీట్లు ఈసీఈ, ఈఈఈ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఫుడ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్, పెట్రోలియం, కెమికల్ ఇంజనీరింగ్ విభాగాలకు ఉండడం విశేషం.


సీఎస్ఈకి ఫుల్ డిమాండ్

ఐదేళ్ల క్రితం వరకు ఇంజనీరింగ్ విద్యలో కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ) మాత్రమే ఐటీ విభాగంలో ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా మరికొన్ని ఇంజనీరింగ్ కోర్సులను ప్రధాని నరేంద్రమోదీ తీసుకువచ్చి ప్రోత్సహించారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి ఇంజనీరింగ్ కోర్సులు కొత్తగా వచ్చి చేరాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే వారిలో అత్యధికంగా కంప్యూటర్ సైన్స్‌నే ఎంచుకుంటున్నారు. కౌన్సెలింగ్‌లో కంప్యూటర్ సైన్స్‌కు అనుబంధంగా ఉన్న డేటా సైన్స్, ఐటీ, ఇతర విభాగాలకు ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు.



కొనసాగుతున్న కౌన్సెలింగ్

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ నిర్వహించిన ఈఏపీసెట్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇంజనీరింగ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎందరో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్‌లో కూడా ఉత్తమ ర్యాంకులు సాధించారు. అటువంటి వారంతా ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ విద్యా సంస్థల్లో చేరేందుకు సిద్ధపడ్డారు. కాకినాడ జేఎన్టీయూ, రాజమహేంద్రవరంలోని ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయాల్లో కంప్యూటర్ సైన్స్ ఐటీ సెక్టార్‌లో సీట్ల కోసం విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఆయా ప్రభుత్వ కళాశాలల్లో అంతంతమాత్రంగానే సీట్లు ఉండడం వారిని నిరాశ పరుస్తోంది. ఐటీ రంగంలో ఉద్యోగం పొందాలంటే కంప్యూటర్ సంబంధిత కోర్సులు చేయాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం ఐటీ సెక్టార్‌లో సంక్షోభం ఉన్నప్పటికీ ఆ రంగంలోనే ఎక్కువగా ఉద్యోగాలు పొందే పరిస్థితి కనిపిస్తోంది. తొలుత తక్కువ ప్యాకేజీలో ఉద్యోగంలో చేరినా ఆ తర్వాత అనుభవంతో పాటు కొత్త కోర్సులు నేర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని భావించి విద్యార్థులు కంప్యూటర్ సైన్స్‌పైనే ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు. కౌన్సెలింగ్‌లో భాగంగా ఈ నెల 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఇచ్చారు. 13న ఆప్షన్లు మార్చుకునే అవకాశం ఉంది. 16వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఇక 17 నుంచి 22వ తేదీ వరకు విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అనంతరం 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభించాలని ఇప్పటికే ఇంజనీరింగ్ కళాశాలలకు ఆదేశాలు అందాయి.



అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో మైనర్ సహా ఐదుగురి అరెస్టు

ద్రాక్షారామ, జూలై 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం కేసులో పోలీసులు బుధవారం ఒక మైనరు సహా ఐదుగురిని అరెస్టు చేశారు. వెల్ల గ్రామానికి చెందిన మైనరు బాలుడుతో సహా యర్రంశెట్టి త్రిమూర్తులు అలియాస్ తరుణ్, చిక్కాల వీరమణికంఠ అలియాస్ మణి, వేపూరి వీర వెంకటసత్యనారాయణ అలియాస్ నాని, ఈత రామచంద్రుడు అలియాస్ రాము, సిరిగినీడి దుర్గాప్రసాద్ అలియాస్ డి.పిలను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. డీఎస్పీ బి.రామకృష్ణ రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. వెల్ల గ్రామంలో అరుంధతీపేట వద్ద జగనన్నకాలనీలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ధ్వంసం చేస్తే వేరొక ప్రాంతంలో పెట్టుకుంటారని పథకం ప్రకారం ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి విగ్రహాలు పరిసర ప్రాంతంలో మద్యం సేవించారు. నిందితులు గునపంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొట్టి నేలకూల్చారు. విగ్రహం కిందపడినప్పుడు శబ్దం వచ్చి అలికిడి కావడంతో ఎవరైనా వచ్చి చూస్తారనే భయంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. వీరికి నేరంలో ఎప్పటికప్పుడు సమాచారం అందచేసి వారు తప్పించుకునేందుకు సిరిగినీడి దుర్గా ప్రసాద్ అలియాస్ డి.పి సహకరించారు. ఈ ఘటనపై ద్రాక్షారామ పోలీసుస్టేషన్‌లో ఈనెల 5న కేసు నమోదు చేశామని డీఎస్పీ చెప్పారు. జిల్లా ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ఖాదర్ బాషా పర్యవేక్షణలో సీఐ దొరరాజు సర్కిల్‌లో ఎస్ఐలతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టామన్నారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీం ఇతర సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సమగ్ర దర్యాప్తు చేశామన్నారు. నేరానికి ఉపయోగించిన రెండు మోటారు సైకిళ్లు, గునపం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన డీఎస్పీ, సీఐ ఎస్ఐలు సురేంద్ర, జానీభాషా సురేష్‌బాబు, చైతన్య సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు.

విద్యార్థినిని కత్తితో బెదిరించిన ఆగంతకుడు

కొత్తపేట, జూలై 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం అవిడి శివారు చప్పిడివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బుధవారం మధ్యాహ్నం బాత్రూమ్‌కు వెళ్లగా ఓ ఆగంతకుడు కత్తితో బెదిరించి లొంగదీసుకునే ప్రయత్నం చేశాడు. బాలిక అతడిని వదలించుకుని కేకలు వేయడంతో ఉపాధ్యాయులు వెళ్లేసరికి ఆగంతకుడు గోడదూకి పరారయ్యాడని తెలుస్తోంది. షార్ట్, టీషర్ట్ వేసుకుని పెద్ద జుట్టుతో ఉన్న యువకుడిగా విద్యార్థిని గుర్తించింది. దీనిపై కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్‌కు పాఠశాల హెచ్ఎం కుంచే అరుణశ్రీ ఫిర్యాదు చేశారు. ఎంఈవో ఎం.హరిప్రసాద్, డీవైఈవో వెళ్లి బాలికను విచారించారు. ఎస్ఐ వివరాలు తెలుసుకున్నారు. దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వీసాల పేరుతో మోసం..కేసు నమోదు

పి.గన్నవరం, జూలై 11: మస్కట్ దేశంలో అగ్రిమెంట్ కంపెనీ వీసాలు పేరుతో మోసగించిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాగుల్లంకకు చెందిన ఉంద్రాజవరపు సురేష్ ఉపాధి కోసం గల్ఫ్ దేశం వెళ్లాలనుకున్నాడు. మార్చి నెలలో రాజోలుకు చెందిన గుబ్బల దుర్గాప్రసాద్, శ్రీనులు సురేష్‌కు పరిచయమై మస్కట్ దేశంలో ప్రముఖ కంపెనీలో ఉద్యోగాలున్నాయని రూ.2 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో సురేష్ ఏప్రిల్ 4న మస్కట్ బయలుదేరగా ఎయిర్‌పోర్టు తనిఖీల్లో టూరిస్ట్ వీసాగా గుర్తించారు. ఈ విషయాన్ని ఏజెంట్లకు సూచించగా, మస్కట్‌లో తమ వాళ్లు ఉన్నారని ఇబ్బందులు ఉండవని చెప్పారు. దీంతో మస్కట్‌కు వెళ్లిన సురేష్ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాడు. తల్లి వెంకాయమ్మ ఏజెంట్ల వద్దకు వెళ్లి తన కుమారుడు ఇబ్బందులు పడుతున్నాడని, ఇండియాకు తిరిగి రప్పించాలని కోరింది. రూ.లక్ష ఇస్తే వెనక్కి రప్పిస్తామని ఏజెంట్లు డిమాండ్ చేశారు. దీంతో వెంకాయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ పీవీవీ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటక రంగ పూర్వ వైభవానికి కృషి చేయాలి

ప్రముఖ రంగ స్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ


గుమ్మడి గోపాలకృష్ణకు జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

పోర్టుసిటీ(కాకినాడ), జూలై 11: నాటక రంగం పూర్వ వైభవానికి కలిసికట్టుగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. గురువారం రాత్రి సినిమా రోడ్డులో సూర్య కళా మందిరం అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వానపు నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి గుమ్మడి గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో భాగంగా తొలుత మలిసంధ్య అనే నాటిక ప్రదర్శించారు. కుటుంబ బాంధవ్యాలు ఏ విధంగా ఉండాలి అనే అంశం ప్రధాన ఇతివృత్తంగా నాటిక ప్రదర్శన జరిగింది. అనకాపల్లి శ్రీ షిర్డీ సాయి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. జి.సుబ్బలక్ష్మీ మూల కథ రాయగా, పొన్నాడ ముత్యాలరావు దర్శకత్వం వహించారు. అనంతరం నిర్వాహకులు గోపాలకృష్ణ తదితరులకు మెమెంటో అందించి సత్కరించారు. కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అచ్యుత రామారెడ్డి, పంపన దయానంద బాబు పాల్గొన్నారు.


మలిసంధ్య నాటికలో ఓ సన్నివేశం

టోలిన్ లిక్విడ్ ట్యాంకర్ బోల్తా


బోల్తాపడిన ట్యాంకర్

పెద్దాపురం, జూలై 11 : పెద్దాపురం ఏడీబీ రహదారిలో గురువారం తెల్లవారుజామున అత్యంత ప్రమాదకరమైన టోలిన్ లిక్విడ్‌తో వెళుతున్న ట్యాంకర్ బోల్తా పడింది. కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బంది తక్షణమే రక్షణ చర్యలు తీసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలం వద్ద మూడు అగ్నిమాపక శకటాలను సిద్ధం చేశారు. జన సంచారం లేని ప్రదేశం కావడంతో పెను ప్రమాదం తప్పింది. అప్పటికే ట్యాంకర్‌లో ఉన్న 11 టన్నుల లిక్విడ్ టోలిన్ గాల్లో కలిసిపోయిందని అధికారులు తెలిపారు. ట్యాంకర్‌లో ఉన్న మిగిలిన లిక్విడ్‌ను ఎయిర్‌ప్రెజర్ ద్వారా మరో ట్యాంకర్‌లోకి డంప్ చేశారు. సంఘటన జరిగిన రహదారిలో పోలీసులు ఎటువంటి వాహనాలను అనుమతించలేదు. ఏడీఎఫ్‌వో ఎం.శ్రీహరిజగన్నాథ్, ఎస్ఐ వెలుగుల సురేష్ సంఘటనా స్థలం వద్ద ఉండి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు.

రైళ్లల్లో దొంగతనాలు

నిందితుడిని పట్టుకున్న పోలీసులు

తుని రూరల్, జూలై 11:కదులుతున్న రైళ్లలో, ఏసీ బోగీల్లో, స్లీపర్ బోగీల్లో నిద్రిస్తున్న ప్రయాణికుల నుంచి బంగారు ఆభరణాలు దొంగలించిన వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. రైళ్లలోని నిఘా కెమెరాల ఆధారంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లికి చెందిన 23 ఏళ్ల సేనాపతులు మనీష్ కదలికలను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 190 గ్రాముల బంగారు ఆభరణాలు, వీటి విలువ రూ.12 లక్షలు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. తుని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విజయవాడ రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నట్లు రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ అబ్దుల్‌మారుఫ్‌తోపాటు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ పితాని శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రామకోటి, శివసురేష్, ప్రసాదరావు, జి.శ్రీనివాసరావు, ఏఎస్ఐ గోవిందరావులను రైల్వే ఎస్పీ అభినందించారు.

జీవితంపై విరక్తితో గోదావరిలోకి దూకిన వ్యక్తి

కాపాడిన ఫైర్ కానిస్టేబుల్


బయటకు తీసుకువస్తున్న దృశ్యం

కొవ్వూరు, జూలై 11: గోదావరి నదిలో దూకి ఆత్మహత్యా యత్నం చేసిన వ్యక్తిని కొవ్వూరు ఫైర్ కానిస్టేబుల్ రక్షించాడు. అనకాపల్లి జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటరమణ మూర్తి 25 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో నిద్ర లేక జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైనుంచి ఈ నెల 11వ తేదీ రాత్రి గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న రాత్రి గస్తీ నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఫైర్ సిబ్బందికి సమాచారం అందించాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది స్కూబా డ్రైవ్ మాస్టర్, స్విమ్మింగ్ ట్రైనర్ ఎం.ప్రకాష్‌బాబు రెస్క్యూ బోట్‌తో హుటాహుటిన నదిలోకి వెళ్లి వెంకటరమణమూర్తిని రక్షించి బయటకు తీసుకువచ్చారు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణమూర్తిని రక్షించిన ప్రకాష్‌బాబును ఫైర్ అధికారి ఏబీఎస్ఎస్ వేణు అభినందించారు.


కానిస్టేబుల్ ప్రకాష్

గతంలో పనిచేసిన ముమ్మిడివరం సీఐపై కేసు

ముమ్మిడివరం, జూలై 11: ముమ్మిడివరంలో గతంలో సీఐగా పనిచేసిన ఎం.జానకీరామ్‌పై ముమ్మిడివరం పోలీసుస్టేషన్‌లో 227/2024గా ఎఫ్ఐఆర్ నమోదైంది. ఒక సివిల్ వివాదం కారణంగా ఒక వ్యక్తికి మేలు చేకూర్చే విధంగా సీఐ వ్యవహరించారనే అభియోగంపై ఈ ఎఫ్ఐఆర్ నమోదైనట్టు సమాచారం. ముమ్మిడివరంలోని సర్వే నంబరు 518లో 3ఎకరాల 16 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమికి సంబంధించి ముమ్మిడివరానికి చెందిన పోలిశెట్టి రాజేష్‌కుమార్‌కు మరికొందరికీ మధ్య చాలాకాలంగా సివిల్ వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న భూమికి సంబంధించి అమలాపురానికి చెందిన పిల్లా రమేష్‌కు పార్టీషన్ డీడ్ రాయించాడని, మల్లప శివరామకృష్ణ 2009లో మృతిచెందితే 2019లో మల్లప శివరామకృష్ణ వీలునామా ఎలా బయటికి వచ్చిందని, రాజేష్‌కుమార్ 2018 డిసెంబరు 13న ముమ్మిడివరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ క్రైమ్ ఇన్వెస్టిగేషన్‌లో పోలిశెట్టి రాజేష్‌కుమార్ చేసిన ఆర్టీఐ అప్లికేషన్‌కు ముమ్మిడివరం ఎస్‌హెచ్‌వో 2019లో ఒక అన్ రిజిష్టర్ వీలునామా ఇచ్చారని మరలా రాజేష్‌కుమార్ ఫైల్ చేసిన ఆర్టీఐ అప్లికేషన్‌కు అప్పటి సీఐ ఎం.జానకీరామ్ నోటరైజ్డ్ వీలునామా ఇచ్చారని పోలీసు రికార్డుల్లో అన్ రిజిష్టర్డ్ వీలునామాను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నోటరైజ్డ్ వీలునామాగా మార్చి పిల్లా రమేష్‌ను రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాడని పోలిశెట్టి రాజేష్‌కుమార్ ఆరోపించారు. ఈ అభియోగంపై సీఐ జానకీరామ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిందిగా కోర్టు ముమ్మిడివరం పోలీసులను ఆదేశించినట్టు సమాచారం.

ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు

గొల్లప్రోలు రూరల్, జూలై 11: గొల్లప్రోలు మండలం మల్లవరం ఆర్‌ఆర్‌బీ చెరువులో ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ గాలింపు చర్యలు కొనసాగించాయి. మండలంలోని ఏకే మల్లవరం గ్రామానికి చెందిన వృద్ధుడు తటవర్తి వేమన్నదొర పశువులు మేపేందుకు 7వ తేదీ సాయంత్రం మల్లవరంలోని ఆర్‌ఆర్‌బీ చెరువు వద్దకు వెళ్లి తిరిగి రాకపోవడంతో చెరువులో పడి గల్లంతై ఉండవచ్చునని పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది గాలింపు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీంతో జిల్లా కలెక్టరు సూచనల మేరకు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. రాత్రి వరకూ వృద్ధుడి ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. యువకుడి మృతి

రాజానగరం, జూలై 11: మండలంలోని ఫరిజెల్లిపేట సమీపంలోని చాగల్నాడు కాలువ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. తోకాడ గ్రామానికి చెందిన నల్లమిల్లి సందీప్(20), అతడి స్నేహితుడు గండి వీరవెంకట సత్యనారాయణ కలిసి మోటార్‌సైకిల్‌పై రాజానగరం వచ్చారు. తిరిగి వెళ్తుండగా మార్గమధ్యంలో చాగల్నాడు కాలువ సమీపంలోని మలుపులో ఎదురుగా వస్తున్న లారీ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సందీప్ కింద పడిపోవడంతో లారీ అతడి పైనుంచి దూసుకుపోవడంతో శరీర భాగాలు చెల్లాచెదురై అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్రగాయాలు కావడంతో సమీపంలోని జీఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ పవన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఓ లారీలో రవాణా చేస్తున్న గంజాయిని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ వివరాలను వెల్లడించారు. దివాన్ చెరువు జంక్షను వద్ద బుధవారం వాహన తనిఖీలు చేస్తుండగా కాకినాడ నుంచి రాజస్థాన్ వెళ్తున్న ఓ లారీలో 153 కిలోల గంజాయిని గుర్తించామన్నారు. సీరారామ్, గోమద్‌రామ్ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి సేకరించిన సమాచారంతో కాకినాడ రూరల్ సర్పవరంలో మరో 200 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. అక్కడ తిమ్మాపురానికి చెందిన కోటిబోయిన ప్రసాద్, ఒడిసాకు చెందిన ప్రతాప్ మండల్‌ని అదుపులోకి తీసుకున్నామన్నారు. మొత్తం రూ.20 లక్షలు విలువ చేసే 353 కిలోల గంజాయి, రూ.6 వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గంజాయి రవాణాకు కారణమైన రాజస్థాన్‌కు చెందిన రామ్‌నివాస్, సందీప్ అనే వ్యక్తులను కూడా అరెస్టు చేశామని చెప్పారు.

అన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం


విరాళం చెక్కు అందిస్తున్న దాతలు

అన్నవరం, జూలై 11: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం బెంగుళూరుకు చెందిన ఐ.రామ్మోహన్, రమాసుందరి దంపతులు రెండు లక్షలు, సత్యదేవా గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ 50 వేలు విరాళంగా సమర్పించారు. దాత ఈమొత్తాన్ని ఆలయ సూపరింటెండెంట్ కంచి మూర్తికి అందజేయగా దాతను ఆయన అబినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు. హైదరాబాద్‌కు చెందిన వై.రాధాకృష్ణ అన్నదాన పథకానికి రూ 1,00,116లు సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

రెండు టాటా ఏస్ వాహనాలపై కేసు

శంఖవరం, జూలై 11: ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా నిబంధనలకు విరుద్ధంగా రాకపోకలు సాగిస్తున్న రెండు టాటా ఏస్ వాహనాలపై మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గురువారం కేసు నమోదు చేశారు. వీటికి రూ.2.08 లక్షలు జరిమానా విధించి సీజ్ చేసినట్లు ఎంవీఐ శ్రీనివాస్ తెలిపారు. వాహనాలను తుని ఆర్టీసీ డిపోకు తరలించామన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కొండబాబు

కార్పొరేషన్(కాకినాడ), జూలై 11: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) అన్నారు. సీజనల్ వ్యాధులు, అతిసార, డెంగీపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులోని సూపర్‌బజార్ నుంచి జగన్నాథపురం వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌బజార్, మసీద్ సెంటర్, గ్లాస్‌హౌస్, గోల్డ్‌మార్కెట్ సెంటర్ మీదుగా ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రతతోనే అనేక వ్యాధులను నియంత్రించవచ్చన్నారు. నగరపాలక సంస్థ ద్వారా మెరుగైన పారిశుధ్య నిర్వహణ చేస్తున్నప్పటికీ ప్రజలు కూడా చైతన్యవంతులై తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఒకప్పుడు తమ ప్రభుత్వ హయాంలో సీఎం చంద్రబాబు దోమలపై దండయాత్ర కార్యక్రమాన్ని కాకినాడ నుంచే శ్రీకారం చుట్టారని, ఆ సమయంలోనే ప్రజల్లో ఎంతో అవగాహన వచ్చిందన్నారు. కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు పాటిస్తే అతిసార, డెంగీ వంటి వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి నాగేశ్వరనాయక్, నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.సత్యకుమారి, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండబాబు

పోస్టల్ పథకాలపై అవగాహన

పెద్దాపురం, జూలై 11: పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నాయుడు అన్నారు. పొదుపు పథకాలపై అవగాహన కల్పించేందుకు గడపగడపకూ పోస్టల్ సేవలు పేరుతో పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీని చేపట్టారు. పోస్టల్ పేమెంట్ బ్యాంక్, ప్రమాద బీమా, పొదుపు పథకాలు కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పోస్టల్ సిబ్బంది సాగర్, ప్రసాద్, వరహాలుబాబు, స్వామి, శ్రీనివాస్, అడ్డగర్ల సురేంద్రనాథ్ పాల్గొన్నారు.

కొనసాగిన టీడీపీ ఆందోళన

గొల్లప్రోలు రూరల్, జూలై 11: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని అపర్ణాదేవి ఆలయం వద్ద టీడీపీ నేతలు గురువారం ఆందోళన కొనసాగించారు. అపర్ణాదేవి ఆలయ కమిటీ నిర్వహణను అధికారులు ఏకపక్షంగా జనసేన నేత కుంపట్ల సత్యనారాయణకు అప్పగించడం, కమిటీల్లో తమకు భాగసామ్యం కల్పించకపోవడంపై వారు నిరసన తెలుపుతున్నారు. పొత్తు ధర్మాన్ని పాటించి తమకు కమిటీల్లో ప్రాతినిధ్యం కల్పించాలని, వైసీపీ హయాంలో కమిటీల్లో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

జనసేన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

శంఖవరం, జూలై 11: గ్రామంలో జనసేన కమిటీ ఎన్నిక నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మేకల కృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేసి పార్టీ నియమ, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటానని అన్నారు. మేడిశెట్టి సూర్యకిరణ్, జ్యోతుల శ్రీనివాస్, కరణం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎస్ఈబీ దాడులు

తుని రూరల్, జూలై 11: తుని ఎస్ఈబీ పోలీసులు ఆధ్వర్యంలో సారా బట్టీలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో తుని ఎస్ఈబీ స్టేషన్ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌వో పి.చిట్టిబాబు, కాకినాడ సౌత్ ఎస్ఈబీ స్టేషన్ సిబ్బంది, కాకినాడ నార్త్ ఎస్ఈబీ స్టేషన్ సిబ్బంది కలిసి తొండంగి మండలం గడ్డిపేటలో దాడులు నిర్వహించి 1100లీటర్ల బెల్లపు ఊట, చోడిపిల్లిపేటలో 2500లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తుని ఎస్ఈబీ స్టేషన్ ఎస్‌హెచ్‌వో చిట్టిబాబు తెలిపారు.

హైస్కూల్‌కు సీలింగ్ ఫ్యాన్లు బహూకరణ

జగ్గంపేట, జూలై 11: తాము చదువుకున్న పాఠశాలకు జగ్గంపేట హైస్కూల్ 1992-93 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. పాఠశాలలో విద్యార్థులు తరగతి గదుల్లో ఫ్యాన్లు లేక ఉక్కపోతకు గురవుతున్నారని తెలిసి 20 సీలింగ్ ఫ్యాన్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీఎస్ రంగారావుకు వారు అందజేశారు.

'అక్నూ'లో ఆర్వో ప్లాంటు ప్రారంభం

సర్పవరం జంక్షన్, జూలై 11: విద్యార్థుల ఆరోగ్యం, దాహార్తిని తీర్చేందుకు ఆర్వోప్లాంటు ఏర్పాటు చేసిన ఓఎన్‌జీసీ యాజమాన్యానికి అక్నూ ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మాపురం అక్నూఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్‌లో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ రూ.3.50లక్షల నిధులతో గురువారం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటును ఆ సంస్థ ఈస్ట్రన్ ఆఫ్ షోర్ ఎపెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సురేష్‌బాబుతో కలిసి ప్రారంభించారు. పీజీ సెంటర్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సీఎస్ఆర్‌లో భాగంగా తమవంతు సహకారం అందిస్తామని ఓఎన్‌జీసీ సంస్థ ఈడీ సురేష్‌బాబు హామీ ఇచ్చారు. ఏఐడబ్ల్యూసీ వైస్ ప్రెసిడెంట్ వి.మీనాక్షి, ట్రెజరర్ పి.పద్మజారాణి, మెంబర్ రత్నగిరి ఉష, ఓఎన్‌జీసీ సీనియర్ హెచ్‌ఆర్ఎస్ అన్వర్ పాల్గొన్నారు.

'సస్యరక్షణ పద్ధతులు పాటించాలి'

గొల్లప్రోలు రూరల్, జూలై 11: పత్తిసాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు పొందాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ ఎస్.సీతారామశర్మ సూచించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ రైతు సేవాకేంద్రంలో గురువారం పత్తి రైతుల సదస్సు నిర్వహించారు. పత్తిసాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, గులాబీ రంగు పురుగు, పిండి నల్లి నివారణకు తీసుకోవాల్సిన చర్యలగురించి వివరించారు. ఉపసర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, ఆత్మ డిప్యూటీ డైరెక్టరు జ్యోతిర్మయి, వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారి సత్యనారాయణ, రిలయన్స్ ప్రతినిధి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాక్షికంగా కూలిన సుద్దగడ్డ బ్రిడ్జి


బ్రిడ్జి పాక్షికంగా కూలిపోయిన దృశ్యం

గొల్లప్రోలు, జూలై 11: గొల్లప్రోలు పట్టణ శివారులో సుద్దగడ్డ(కొండ) కాలువపై గల బ్రిడ్జి పాక్షికంగా కూలిపోయింది. ఈబీసీ కాలనీ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న బ్రిడ్జి కొంతకాలంగా సుద్దగడ్డ ప్రవాహానికి కోతకు గురవుతోంది. ఈ నేపథ్యంలో బ్రిడ్జి రక్షణ గోడ పాక్షికంగా కూలిపోవడంతోపాటు బ్రిడ్జికి చేర్చి ఉన్న మట్టి అండలుగా జారిపోతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పీబీసీ కెనాల్‌లో గుర్రపుడెక్క అవరోధాల తొలగింపు ప్రారంభం

సామర్లకోట, జూలై 11: సామర్లకోట గోదావరి కాలువ లాకులనుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్‌కు సాగునీరు సమృద్ధిగా విడుదల చేసేందుకుగాను గుర్రపుడెక్క అవరోధాలను తొలగించే పనులను ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. ఈ పనులకు పీబీసీ ఆయకట్టుదారుల రైతుసంఘం నాయకులు యార్లగడ్డ రవిచంద్రప్రసాద్(చిన్నీ) పనులు ప్రారంభించారు. ఇటీవల పీబీసీ రైతులు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఎస్వీఎస్ఎన్ వర్మ, రైతులు విన్నవించిన విషయం తెలిసిందే. దీంతో ఉపముఖ్యమంత్రి ఆదేశాల మేకు ఇరిగేషన్ అధికారులు సత్వరం నిధులు కేటాయింపులు చేసి పీబీసీ కెనాల్‌లో గుర్రపుడెక్క అవరోధాలు సామర్లకోటనుంచి కొండెవరం వరకూ 12.75 కిలోమీటర్ల పొడవునా గుర్రపుడెక్క అవరోధాలు తొలగించేందుకు రూ.13.50లక్షల నిధులు కేటాయించినట్లు ఈఈ శేషగిరిరావు తెలిపారు.

ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

ఏలేశ్వరం, జూలై 11: ఉద్యోగులకు అండగా ఎంప్లాయిస్ యూనియన్ ఎల్లప్పుడూ ఉంటుందని డిపో కార్యదర్శి యు.బి.యమ్. కుమార్ అన్నారు. ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీనియర్ కామ్రేడ్ ఎస్.వి.వి.ఎస్.ఎన్.రాజు యూనియన్ జెండా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు బి.నానిబాబు, నారాయణ, వీరవరం శ్రీను, లోవరాజు, అప్పారావు, శ్రీను, నారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేటలో పలు ప్రాంతాల్లో నిలిచిన నీటి సరఫరా

జగ్గంపేట, జూలై 11: స్థానిక గుర్రప్పాలెం రోడ్డులోని మంచినీటి ట్యాంకు నుంచి పద్మనాభనగర్, శెట్టిబలిజపేట, సంఘపువీధి, మరిమొక్క వీధి, గెద్దపేట ప్రాంతాలకు మూడు సమయాల్లో నీరు సరఫరా అవుతుంటుంది. బుధవారం ట్యాంకు దగ్గర మరమ్మతులకు గురవడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మంచినీటి కోసం కుళాయిల మీద ఆధారపడ్డ ప్రజలు నానా అవస్థలు పడ్డారు. దీనిపై పంచాయతీ సిబ్బందిని అడగ్గా గతంలో ఉన్న ట్యాంకును తొలగిస్తున్న సమయంలో పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయన్నారు. దీంతో కొన్ని ప్రాంతాలకు పంచాయతీ అధికారులు, సిబ్బంది ట్యాంకర్ల ద్వారా గురువారం నీరందించారన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై వినతి

జగ్గంపేట, జూలై 11: ఆర్అండ్ఆర్ దేవీపట్నం కాలనీ నిర్వాసితులు, దేవీపట్నం మాజీ జడ్పీటీసీ సిద్ద అన్నపూర్ణ, తిరుమలశెట్టి శారద, కుంచనపల్లి రోజా, శేఖర్ తదితరులు తమ సమస్యలపై ఎమ్మెల్యే జ్యోతులకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులుగా ఆర్అండ్ఆర్ కాలనీలోకి వచ్చిన నాలుగేళ్లనుంచి తమ సమస్యలు తీర్చే నాధుడే కరువయ్యాడన్నారు. తమకు ప్యాకేజీ సవ్యంగా ఇవ్వలేదని, ఇంటి నిర్మాణం ప్రారంభించలేదని, భూసేకరణప్యాకేజీ అందలేని, ఉపాధిలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు.

'ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి'

గొల్లప్రోలు, జూలై 11: ఘనవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా పారిశుధ్య నిర్వహణ మెరుగుకు చర్యలు చేపడుతున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టరు, స్వచ్ఛ సర్వేక్షన్ డైరెక్టర్ శ్రీనివాసన్ తెలిపారు. గురువారం ఆయన గొల్లప్రోలు పట్టణంలో పర్యటించారు. నగర పంచాయతీ పరిధిలోని ఖాళీస్థలాలు, చెరువులు, కాలువలు, పుంతలు, రక్షిత మంచినీటి పథకం రిజర్వాయర్‌లతోపాటు ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించారు. నగర పంచాయతీ కార్యాలయంలో సచివాలయాల సిబ్బందికి సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, ఘన వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం తదితర అంశాల గురించి వివరించారు. నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనరు జానకీ వల్లీప్రియ, మేనేజర్ రామప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ప్రకాష్, హెచ్ఏ మహేష్ ఉన్నారు.

'జగన్నాథపురానికి ప్రత్యేక నీటి ప్రాజెక్టుకు ప్రతిపాదనలు'


కార్పొరేషన్(కాకినాడ), జూలై 11: కాకినాడ జగన్నాథపురం ప్రాంత ప్రజలకు సమృద్ధిగా మంచినీరు అందించేందుకు ప్రత్యేక ప్రాజెక్టు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. కమిషనర్ వెంకటరావు, ఇంజనీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి గురువారం ఆయన అరట్లకట్ట జలాశయాన్ని సందర్శించారు. అక్కడినుంచి జగన్నాథపురం ప్రాంతానికి నేరుగా మంచినీటిని అందించేందుకు ఉన్న అవకాశాలు, ప్రతిపాదనలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేరుగా అరట్లకట్టనుంచి మంచినీటి సరఫరా జరిగితే జగన్నాథపురం ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ మహాలక్ష్మీనగర్‌లో ఫిల్టరేషన్ ప్లాంట్ నిర్మించే అవకాశం ఉందన్నారు. జగన్నాథపురంలో ఉన్న ఆరు రిజర్వాయర్ల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఈలు పి.సత్యకుమారి, వెంకటరావు, టీడీపీ నగర అధ్యక్షుడు వీరు ఉన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, జూలై 11: నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి సమస్య పరిష్కారానికి అన్నివిధాలా చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా తెలిపారు. మండలంలోని టి.రాయవరంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.49లక్షలతో నిర్మించే 40వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. రాయవరం పంచాయతీ శివారులో పి.జగన్నాథపురంలో మరో రూ.49లక్షలతో నిర్మించే ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై దృష్టిసారించినట్లు తెలిపారు. రాయవరం, జగన్నాథపురం గ్రామ రహదారులు దారుణంగా దెబ్బతిన్నాయని, వాటి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని రెండు గ్రామాల ప్రజలు, మహిళలు కోరారు. సత్యప్రభకు సర్పంచ్ తటవర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో రెండు గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్యబాబు, యాళ్ల జగదీష్, అమరాది వెంకట్రావు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబాబు, మిరియాల శ్రీను, సత్యంశెట్టి సీతారాం, యాళ్ల విశ్వేశ్వరరావు, అడ్డాల త్రిమూర్తులు, కురందాస్ అప్పలరాజు, బీజేపీ, జనసేన నాయకులు సింగిలిదేవ్ సత్తిరాజు, దాసం శేషారావు, ఊటా వీరబాబు పాల్గొన్నారు. ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో అధికారులు, టీడీపీ నాయకులు ఎమ్మెల్యే సత్యప్రభను కలిసి అభినందించారు.

రూరల్లో నిలిచిన అభివృద్ధి పనులు ప్రారంభించాలి

» సీఎం చంద్రబాబుకు నివేదిక అందించిన మాజీ ఎమ్మెల్యే


నివేదికను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

సర్పవరం జంక్షన్, జూలై 11: కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పలు అభివృద్ధి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు కోరారు. ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబును గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2014-19లో టీడీపీ హయాంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, వైసీపీ అధికారంలోకి రావడంతో వాటన్నింటినీ నిలిపివేశారన్నారు. రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విజయరాయుడుపాలేనికి చెందిన కార్యకర్త బ్రెయిన్‌డెడ్ కావడంతో ఆ కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ అందించాలని, మరికొంతమంది వైద్యానికి సంబంధించి సహాయం కోరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నిలిచిపోయిన ముఖ్యమైన అభివృద్ధి పనులకు చెందిన నివేదికను సీఎంకు అందజేశామన్నారు. కూటమి అభ్యర్థి పంతం నానాజీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేసిన పిల్లి దంపతులను చంద్రబాబు అభినందించారు. భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జగ్గంపేట, జూలై 11: జగ్గంపేట 11కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో ఎలక్ట్రికల్ లైన్లు మరమ్మతులు, లైన్‌లో చెట్ల నరికివేత కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ కె.రత్నాలరావు తెలిపారు. 11కేవీ ఫీడర్ పరిధిలోని బాలాజీనగర్, టవర్ కాలనీ, గుర్రంపాలెం, గొల్లలగుంట, మల్లిపాకల్లో వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సామర్లకోటలో..

సామర్లకోట, జూలై 11: శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకూ సామర్లకోట పట్టణ పరిధిలోని పలుప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిపివే స్తున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ ఏవీఎస్వీఎస్ ప్రభాకర్ గురువారం వెల్లడించారు. భీమవరపుపేట, బళ్లమార్కెట్, సంగీతరావుపేట, గోలివారి వీధి, వీర్రాఘవపురం, మఠం సెంటర్, ప్రెసిడెంట్‌గారివీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా, కొత్తూరు, సంపంగితోట, నిమ్మతోట, అయోధ్యరామపురం, పెద్దాపురం మెయిన్‌రోడ్డుల్లో విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

పిఠాపురం రూరల్, జూలై 11: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చునని పెద్దాపురం జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకురాలు భ్రమరాంబ తెలిపారు. పిఠాపురం మండలం విరవలో గురువారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏవో అచ్యుతరావు, వీఏఏ రమ్యశైలి, సర్పంచ్ ఎస్.చింతలరావు పాల్గొన్నారు.

శిశుమందిర్ భవనం ప్రారంభం

ఏలేశ్వరం, జూలై 11: మండలంలోని ఎర్రవరంలో సరస్వతీ శిశుమందిర్‌లో నూతన భవనం గురువారం ప్రారంభించారు. హైదరాబాద్ మిధానీ కంపెనీ డైరెక్టర్స్ గౌరీశంఖర్, హరికృష్ణ, చక్రపాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరరాఘవరావు రూ.25లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ నీరుకొండ సత్యనారాయణ, చెరుకూరి వెంకట సత్యనారాయణరాజు, సింగిలి దేవి, భీశెట్టి పరదేశి పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీ

కాకినాడ రూరల్, జూలై 11: కాకినాడ రామారావుపేటలోని లయన్స్‌క్లబ్ హాల్లో రెడ్‌కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ఛారిటబుల్‌ట్రస్ట్ ద్వారా ఎంపికచేసిన 68మంది పేదలకు గురువారం దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీచేశారు. ముఖ్య అతిథిగా రెడ్‌కాన్వెంట్ పూర్వవిద్యార్థి రామ్‌చరణ్ పాల్గొనగా ఆయన వాటిని అందజేశారు. ట్రస్ట్ గౌరవాధ్యక్షులు డాక్టర్ బాదంబాలకృష్ణ, ట్రస్ట్ అధ్యక్షులు ఎస్.పాపారావు, కార్యదర్శి జగన్నాథరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు

ప్రత్తిపాడు, జూలై 11: ప్రత్తిపాడులో నరేంద్రగిరి శ్రీరామనామ క్షేత్రం ఆలయ అభివృద్ధి కమిటీ గురువారం ఏర్పాటైంది. శ్రీమద్ రామాయణపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు గల్లా సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కమిటీకి అధ్యక్షుడిగా గోగుల వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడిగా తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శిగా కొల్ల రాంబాబు, మరో 20మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయులదే కీలకపాత్ర: డీఈవో

పెద్దాపురం, జూలై 11: పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని డీఈవో పిల్లి రమేష్ అన్నారు. శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో డివిజన్ స్థాయిలో ఉపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పాఠశాలల అభివృద్ధి, ప్రగతి తదితర విషయాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. స్కూల్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం ఫేజ్-2 ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలన్నారు. డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, డీసీఈబీ కార్యదర్శి ఎం.వెంట్రావు, డీఈ నాగేంద్ర, ఎంఈవోలు ప్రభాకర శర్మ, వీఆర్‌కే చౌదరి పాల్గొన్నారు.

మరిడమ్మకు కుంభం

పెద్దాపురం, జూలై 11: మరిడమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి గురువారం కుంభం వేసే కార్యక్రమం నిర్వహించినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. ఈనెల 12న అమ్మవారి దర్శనం భక్తులకు లభించదన్నారు. ఈనెల 13న సంప్రోక్షణల అనంతరం అమ్మవారి దర్శనం భక్తులకు లభిస్తుందన్నారు.

ప్రధానమంత్రి మాతృత్వ యోజనతో మహిళలకు సాధికారత

ప్రత్తిపాడు, జూలై 11: ప్రధానమంత్రి మాతృత్వ యోజన పథకం ద్వారా మహిళలకు సాధికారత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి తెలిపారు. ఐసీడీఎస్, వైద్యఆరోగ్యశాఖ పోలీస్‌శాఖల సమన్వయంతో మండలంలోని ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్, శాంతి ఆశ్రమం, ఎయిడెడ్ హైస్కూల్‌వద్ద మిషన్ శక్తిలో భాగంగా మహిళలకు, గర్భిణులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో ఆర్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ గర్భిణులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తుందన్నారు. రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్, శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.

జగ్గంపేట, జూలై 11: గర్భస్థ శిశువులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందని జగ్గంపేట పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. జగ్గంపేట ప్రభుత్వాస్పత్రి ఆవరణలో గురువారం ఐసీడీఎస్, వైద్యఆరోగ్యశాఖ, పోలీస్ సిబ్బందికి లింగ నిర్ధారణ నిషేధ చట్టం, ఇతర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట సీడీపీవో పూర్ణిమ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్‌శక్తిలో భాగంగా మహిళలు, బాలల చట్టాలపై 100రోజులపాటు గ్రామ, మండలస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు సునీత, ఎస్.అమ్మాజీ, అంగన్‌వాడీ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఏలేశ్వరం, జూలై 11: మహిళలు, బాలికల చట్టాలపై ఏలేశ్వరం, లింగంపర్తిల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ, వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గర్భస్థ శిశువును కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు జి.మంగారత్నం, సూర్యకుమారి, లోవలక్ష్మి పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో అవగాహన ర్యాలీ చేపడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

తాళ్లరేవు, జూలై 11: గాడిమొగ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన గురించి తల్లులకు గురువారం అవగాహన కల్పించారు. బాలల హక్కులు, మహిళా చట్టాలు, పోక్సోచట్టం, వన్‌స్టాప్ సెంటర్లు, లింగనిర్ధారణ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జయభార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సూపర్‌వైజర్ బొడ్డు కుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి పలువురు విద్యార్థుల ఎంపిక

కరప, జూలై 11: మండలంలోని పెద్దాపురప్పాడు బిరుదా సూర్యనారాయణమూర్తి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్ఎం శ్రీనివాస్ తెలిపారు. పదోతరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన టి.కళాతేజస్విని, సీహెచ్.షారూన్ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, ఎం.అఖిలాదేవి, బి.జయశ్రీలక్ష్మి, ఎం.భార్గవిసాయికుమారి శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీకి,ఆర్.ఉమావెంకటలక్ష్మి ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారన్నారు. వీరిని ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పి.సత్యనారాయణ అభినందించారు.

సామర్లకోట, జూలై 11: మండలంలోనూ, పట్టణంలోనూ ప్రభుత్వ పాఠశాలల్లో 9మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి అర్హత సాధించారని ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య గురువారం వెల్లడించారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల నుంచి పి.హరిణి, కె.దివ్యశ్రీశాంతి, వి.మీనాక్షి, వేట్లపాలెం కొండపల్లి గంగన్న మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సూరంపూడి విజయ, కట్టా మౌనిక, బాసం నందిని, జడ్పీ బాలికల ఉన్నతపాఠశాలనుంచి తేజస్విని, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ ఉన్నతపాఠశాల నుంచి పిల్లాహర్షిణీ, గిరిజన ఉన్నతపాఠశాలనుంచి డి.రవికిరణ్ ఉన్నారు. ఎంఈవోలతోపాటు ప్రధానోపాధ్యాయులు తోటకూరరామకృష్ణ అభినందించారు.

తాళ్లరేవు, జూలై 11: కోరింగ పంచాయతీ చినబొడ్డువెంకటాయపాలెం జడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థిని పినపోతు అమృతవర్షిణి నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్ గురువారం తెలిపారు.



'జనాభా నియంత్రణపై అవగాహన ఉండాలి'

జీజీహెచ్(కాకినాడ), జూలై 11: దేశాభివృద్ధికోసం జనాభా నియంత్రణపై ప్రతిఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ డీఎంహెచ్‌వోడాక్టర్ నరసింహనాయక్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీని గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన వారికి లక్కీడీప్ ద్వారా ఎంపిక చేసిన వారికి నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్, కమిషనర్ వెంకట్రావు, డాక్టర్ ఆర్.రమేష్, డీఐవో డాక్టర్ కె.రత్నకుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సరిత, డాక్టర్ ఐ.ప్రభాకర్,డీపీఎంజిల్లాఅధికారి డాక్టర్ సురేఖ, డాక్టర్ బి.రవికుమార్ పాల్గొన్నారు.

పిఠాపురం, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పిఠాపురం పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మంగాయామ్మరావుపేట అర్బన్‌హెల్త్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల్లో సాగింది. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ వై.వినయ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్, జూలై 11: పరిమిత కుటుంబంతో ఆనందమయ జీవితం సాగించవచ్చని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. గురువారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సమావేశం నిర్వహించారు. ట్రస్ట్ అధ్యక్షుడు రత్నప్రసాదరావు, డాక్టర్ నాగేంద్ర, డాక్టర్ చైతన్య డాక్టర్ సిరాజ్ పాల్గొన్నారు.

గండేపల్లి, జూలై 11: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కేవీ నరేష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బిసురేంద్ర, హెల్త్ సూపర్‌వైజర్లు రూతమ్మ, చెల్లారావు, ఈశ్వరమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

తొండంగి, జూలై 11: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పెరుమాళ్లపురం డిగ్రీకళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. గడ్డిపేట ఆరోగ్యకేంద్రం సిబ్బందితో కలిసి లక్ష్మణుడుపేట తదితర గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కలిగించారు.

రైల్వే కార్మికుల ధర్నా

సామర్లకోట, జూలై 11: రైల్వే కార్మికులు, ఉద్యోగులకు ప్రస్తుతం అమలు చేస్తున్న పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ సామర్లకోట ఐవోడబ్ల్యు కార్యాలయం ఎదుట గురువారం పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, ఛైర్మన్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో పెద్దఎత్తున రైల్వే ఉద్యోగులు 180మంది నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘ్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానంలో పలు లోపాలు ఉన్నందున రైల్వే కార్మికులకు ప్రయోజనం లేనందున తక్షణం నూతన విధానాన్ని రద్దు చేయాలన్నారు. 8న కమిషన్‌ను తక్షణం నియమించాలన్నారు. కొవిడ్ కాలంలో నిలుపుదల చేసిన 18 నెలల డీఏ బకాయిలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రైల్వే కార్మికుల, ఉద్యోగుల న్యాయబద్ధమైన కోరికలు అమలు అయ్యేలా చూడాలన్నారు. ధర్నాలో వర్కింగ్ ఛైర్మన్ రామకృష్ణ, విశ్వప్రసాద్, గోపాలరెడ్డి, రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

'పేదలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు'

పెద్దాపురం, జూలై 11: పేదలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి(బాబు) అన్నారు. రైతుబజార్‌వద్ద రాయితీపై కందిపప్పు, సన్న బియ్యం విక్రయకేంద్రాన్ని ఆయన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజుతో కలిసి గురువారం ప్రారంభించారు. కందిపప్పు, బియ్యం ధరలు ప్రస్తుతం రిటైల్ మార్కెట్‌లో ఆకాశాన్నంటుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం పేదలకు అందుబాటులో నిత్యావసర సరుకులు ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. రైతుబజార్లలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రైతుబజార్లలో దేశవాళీ కందిపప్పు అందుబాటులో ఉంటుందన్నారు. సబ్సిడీ కందిపప్పును గత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసి పేదలను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కౌంటర్‌ను ప్రారంభించి వినియోగదారులకు కందిపప్పు, బియ్యం పంపిణీ చేశారు. నిమ్మకాయల రంగనాగ్, తూతిక రాజు, అడబాల కుమారస్వామి, కొరిపూరి రాజు, ఎస్టేట్ ఆఫీసర్ యర్రంశెట్టి శివ పాల్గొన్నారు.